క్లుప్తంగా

ధర్నా జయప్రదం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్ర మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం కడప రైల్వేస్టేషన్‌లోని యూనియన్ కార్యాలయంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ డ్రైవ్

వైవీయూ : కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ కేశవరెడ్డి తెలిపారు. హెటిరో ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపికలకు బీఎస్సీ కెమిస్ట్రీతో పాటు బీకాం, బీఏ విద్యార్థులు హాజరుకావచ్చని తెలిపారు. 2020, 2021, 2022, 2023 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ పూర్తయిన విద్యార్థులు ఈ ఎంపికలకు అర్హులన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని సీపీఐ నాయకులు శుక్రవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్ర మాట్లాడుతూ ఈ యేడు జిల్లాలో వర్షపాత లోటు ఏర్పడిందన్నారు. దీంతో సాధారణ సాగు గణనీయంగా తగ్గిందన్నారు. చాలాచోట్ల పంటలు ఎండిపోయాయని తెలిపారు. గండికోట, వామికొండ, సర్వరాయసాగర్, పైడిపాలెం, చిత్రావతి, బ్రహ్మంసాగర్‌లలో నీటి మట్టాలు చాలా మేరకు తగ్గిపోయాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని ఒక్క మండలాన్ని కూడా ఇంతవరకు కరువు జాబితాలో చేర్చకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు నాగసుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, నగర కార్యదర్శి వెంకట శివ, కేసీ బాదుల్లా, బషీరున్నీసా, వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల రూపకల్పనపై సమావేశం

వైవీయూ : విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడేలా పాఠ్యాంశాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ ఉండాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెమిస్టర్–1, సెమిస్టర్–2లకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్టు, మైనర్ సబ్జెక్టుల నిర్వహణపై సూచనలు చేశారు. వైవీయూ నుంచి విచ్చేసిన ఆచార్య శంకర్, ఆచార్య వై. సుబ్బరాయుడు, ఆచార్య అనితలు, అడ్వకేట్ శాంత హాజరై అకడమిక్ అంశాలపై చర్చించారు. అనంతరం విద్యాసంవత్సరానికి సంబంధించిన సిలబస్, ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్ష విధానాలను చర్చించి కౌన్సిల్ ఆమోదం తెలిపారు.

ఆలయానికి ఏసీ వితరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయానికి ఏసీ వితరణగా అందజేశారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్, డివిజనల్ మేనేజర్ రాజశేఖర్, మోచంపేట కెనరా బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు రైల్వేకోడూరులో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు రాణించడం సంతోషకరమని కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు అభినందించారు. శుక్రవారం కడప నగరంలోని మేయర్ క్యాంపు కార్యాలయంలో తైక్వాండో క్రీడాకారులు జి. నాగజ్యోతి (అండర్–19 స్వర్ణం), ఎస్. అలకనంద (అండర్–14 రజతం), ఎస్.కె. హలీమాసాదియా (అండర్–14 కాంస్యం)లను మేయర్ అభినందించారు.

కార్మికుల హృదయాల్లో దేవుడిగా నిలిచిన సీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల హృదయాల్లో దేవుడిగా నిలిచారని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, రాజశేఖర్‌లు తెలిపారు. ఏపీ పీటీడీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్–2021లో ఉన్న విద్యార్హతల నుండి మినహాయింపు ఇవ్వాలని ఏపీ జేఏసీ అమరావతి ద్వారా ఎంప్లాయిస్ యూనియన్ విన్నవించామన్నారు. పెద్దమనసుతో సీఎం, ఆర్టీసీ ఎండీ తమ కోరిక మేరకు విద్యార్హతల్లో మినహాయింపు ఇచ్చారన్నారు. దీంతో అన్ని కేటగిరీ ఉద్యోగులకు పదోన్నతుల్లో అవకాశం వచ్చిందన్నారు.

వేడుకగా శ్రీ లక్ష్మితులసి పూజలు

కడప కల్చరల్ : కైశిక ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం కడప నగరం శ్రీ భద్రావతి భావనారుషి ఆలయంలో చైర్మన్ ఆమంచి శ్రీనివాసులు పర్యవేక్షణలో శ్రీ లక్ష్మితులసి మాత పూజ నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి హాజరైన మహిళా భక్తులు సామూహికంగా శ్రీ లలితా సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం తులసిమాతకు, మహాలక్ష్మికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా 250 తులసి మొక్కలను పూజకు హాజరైన ఒక్కొక్క మహిళకు అమ్మవారి ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్తీక శుద్ధ ద్వాదశి నాడు ఈ పూజలు నిర్వహించడం శుభలాభదాయకమన్నారు.



పూజలందుకుంటున్న లక్ష్మి తులసి మాత



పూజల్లో పాల్గొన్న భక్తులు

డాక్టర్ నీలవేణికి పురస్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రచయిత్రి, అధ్యాపకురాలు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఒంగోలుకు చెందిన కళామిత్ర మండలి ఆమెకు ఆహ్వానం పంపినట్లు వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. తమ సంఘం కార్యవర్గ సభ్యురాలైన నీలవేణి ఈ పురస్కారం అందుకోవడం ఆమె ప్రతిభ, కృషికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆమె రచయిత్రిగా, పరిశోధకురాలిగా, సాహిత్య కార్యక్రమాల సారథిగా చేసిన కృషికి ఈ పురస్కారం లభించిందని తెలిపారు.

ఓటుహక్కు కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశంలోని అర్హులైన ప్రతి పౌరుడు ఓటుహక్కు కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. కడప నగరంలోని రవీంద్ర నగర్ లో గుల్కన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన, నమోదు, పరిశీలన కేంద్రాన్ని ఆయన సందర్శించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుల్కన్ మసీదు కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాషా, న్యాయవాది హలీం పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలోగల అయ్యప్పస్వామి ఆలయంలో శని, ఆది, సోమవారాలలో మండల పూజ, గ్రామోత్సవం, పుష్పాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం, ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతిపూజ, విశేష అలంకారం ఉంటాయన్నారు. సాయంత్రం మండల పూజ, దశ హారతులతో పూజోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు రాజు దేశ్‌పాండే, ఒంగోలు లక్ష్మారెడ్డి బృందం భజన గీతాలాపన, సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. 27న సాయంత్రం గ్రామోత్సవం ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, సుధీర్ రాయల్, ఇతర భక్తులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



సురేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రిమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కమిటీ నాయకులు

కడప అర్బన్: కడప నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో కొత్తగా సూపర్ స్పెషాలిటీ, కేన్సర్, సైక్రియాట్రి హాస్పిటల్ రోగులకు మెరుగైన వైద్యం కోసం హాస్పిటల్స్‌ను నిర్మించారు. వాటిల్లో సూపర్ స్పెషాలిటీ విభాగం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డిని, క్యాన్సర్ హాస్పిటల్‌కు డాక్టర్ వాణి, సైక్రియాట్రి హాస్పిటల్‌కు డాక్టర్ వెంకటరాముడిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రిమ్స్ కమిటీ ఆధ్వర్యంలో వారిని కలిసి అభినందనలు తెలియజేసి సన్మానించారు.

వన్‌స్టాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం రిమ్స్‌లోని వన్‌స్టాప్ సెంటర్ (సఖి, దిశ కార్యాలయం)లో బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో అందించే సేవలు వివరించారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా వసతి, కౌన్సెలింగ్, వైద్య, పోలీసు, న్యాయపరమైన సేవలను అందిస్తున్నామన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహ నిరోధక చట్టం, బాల కార్మికచట్టం, దిశ యాప్ వంటి అంశాలపైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆపద సమయంలో మహిళా హెల్ప్‌లైన్ నెంబరు 181, పోలీసు హెల్ప్‌లైన్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 112, 1098 తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, నర్సింగ్ హెచ్ఓడీ లిల్లీ, న్యాయవాది ఉమాదేవి, సునీత, శారద, ఓఎస్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి శ్రీలక్ష్మి

నాడు–నేడుతో సర్వాంగ సుందరంగా పాఠశాలలు

– డీఈఓ రాఘవరెడ్డి

వైవీయూ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలన్నీ సర్వాంగసుందరంగా తయారయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి యెద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కడప నగరం జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కడప మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యాశాఖలో గొప్ప మార్పు ప్రారంభమైనదని, మార్పు మంచికే నన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు డిజిటల్ విద్యావిధానానికి ప్రాధాన్యత ఇస్తూ ఐఎఫ్‌పి ప్యానల్స్, ఎల్ఈడీ టీవీలను అందిస్తూ విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని ప్రతి విద్యార్థికి కనీస విద్యాప్రమాణాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుల మార్గదర్శనంలో ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణ, ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ వై. రాఘవరెడ్డి

వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

– గుంతకల్లు సీనియర్ డీపీఓ చౌహాన్

కడప కోటిరెడ్డిసర్కిల్ / కడప కల్చరల్: ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ డీపీఓ చౌహాన్ తెలిపారు. శుక్రవారం కడప రైల్వేస్టేషన్ వద్దగల రైల్వే శుభమ్‌లో మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఆరోగ్య విషయంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు గుర్తించినా సత్వరమే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం 250 మందికి పరీక్షలు నిర్వహించారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి గజలక్ష్మి, ఆర్థో వైద్యులు మురళీమోహన్, జనరల్ మెడిసిన్ డాక్టర్ సుదీప్ వీర్, ఆప్తాల్మజీ వైద్యులు పి.విజయలక్ష్మి, డివిజనల్ మెడికల్ అధి కారి డాక్టర్ శ్రీనివాసులు వైద్య సేవలను అందించారు. అనంతరం 35 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎంఎస్ అధికారి సంపత్‌కుమార్, కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్, కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష, రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, మజ్దూర్ యూనియన్ సెక్రటరీ మధుసూదన్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ రవికుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

టిడ్కో ఇళ్ల వద్ద సదుపాయాలు కల్పించాలి

కడప కార్పొరేషన్: సరోజినీనగర్ సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద మౌళిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం టిడ్కో ఇళ్లు, హెలెన్ కెల్లర్స్ రోడ్, జెడ్పీ మీటింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతిని పరిశీలించారు. టిడ్కో ఇళ్ల వద్ద డ్రైనేజీ, రోడ్డు, డివైడర్ పనులను పూర్తి చేయాలన్నారు. ఆర్చ్‌లోనికి ప్రవేశద్వారం వద్ద మూడు దశల ఫౌంటేన్ ఏర్పాటు చేయాలని, రాజీవ్ గృహ కల్ప డ్రైనేజీని టిడ్కో లే అవుట్ డ్రైనేజీతో అనుసంధానించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి కట్టిన నిర్మాణాలను తొలగించాలన్నారు. హెలెన్ కెల్లర్స్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరుగనున్న ఎల్ఐఎంసీఓ ప్రోగ్రాం పనులను పరిశీలించారు. ఫ్యాన్లు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. గ్యాలరీలు ఏర్పాటు చేసి, ప్రోగ్రాం నందు జీరో వేస్టేజ్‌గా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల వద్ద మ్యాపు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చండ్

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం

వైవీయూ : పుట్టగొడుగుల పెంపకంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ. వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఎంచుకుని శిక్షణ పొందిన రైతులు చక్కటి లాభాలు గడిస్తున్నారన్నారు. రైతులకు కావాల్సిన శిక్షణ తమ సంస్థ అందిస్తుందన్నారు. పుట్టగొడుగులు మంచి ఆహారమని, భవిష్యత్తులో డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. అనంతరం సస్యరక్షణ శాస్త్రవేత్త డా. వి. శిల్పకళ మాట్లాడుతూ పాల పుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగుల పెంపకం గురించి వివరించారు. ఏరువాక శాస్త్రవేత్త డా. ఎస్. రామలక్ష్మీదేవి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలు పెద్దసంఖ్యలో శాకాహారం వైపు మొగ్గుచూపే అవకాశం ఉన్న నేపథ్యంలో పుట్టగొడుగుల డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా. కె. సాయిమహేశ్వరి, డా. ఎస్. మానస, టి. స్వామిచైతన్య, కె. కవిత, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

రాజ్యాంగం గొప్పదనాన్ని తెలుసుకోవాలి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు

వైవీయూ : భారత రాజ్యాంగం గొప్పదనం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పి. శంకర్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని రిమ్స్ నర్సింగ్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ముందస్తుగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్య భారతదేశానికి దిశానిర్దేశం చేసి భారత పౌరులందరినీ ఏకం చేసిన గొప్ప రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని సూచించారు. రిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమగిరికుమారి మాట్లాడుతూ రాజ్యాంగం ఉన్నతత్వాన్ని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన పోటీలు, గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి

– ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఓటరు జాబితా తయారీకి సంబంధించిన బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ కడప అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆరు వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించి ఓటుహక్కు కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమంలో ఎక్కడా కూడా పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు తమకు కేటాయించిన పరిధిలో ఇంటింటికి వెళ్లి వాటిని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం–6, 7, 8లకు సంబంధించి పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యత

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలో శుక్రవారం ఎమ్మెల్యే తన నియోజకవర్గానికి సంబంధించి నలుగురికి రూ. 12 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ .. ఆరోగ్యశ్రీ పథకం అమలు చేసి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించగా, వైఎస్సార్ తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని మరింత బలోపేతం చేసి వేలాది వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

రేపు వన భోజనం

కడప కల్చరల్ : పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పద్మశాలీ కల్యాణ మండపంలో కార్తీక మాస వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పద్మశాలీ సేవా సంఘం వ్యవస్థాపకులు అవ్వారు వెంకట సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని సంస్థ కార్యాలయంలో కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ భద్రావతి భావ నారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అల్పాహారం, అనంతరం కల్యాణోత్సవం, మధ్యాహ్నం కార్తీక మాస వనభోజనం ఉంటుందన్నారు.

గంధం ఉత్సవం

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని అస్తానె మురాదియా 135వ వార్షిక ఉరుసుఉత్సవాలలో భాగంగా శుక్రవారం గంధం ఉత్సవాన్ని నిర్వహించారు. దర్గాలో కొలువుదీరిన సయ్యద్‌షా మురాదలీ సాహెబ్ మజార్ వద్ద దర్గా నిర్వాహకులు జమావుల్లాబాష సాహెబ్ తమ స్వగృహం నుంచి ఊరేగింపుగా తెచ్చిన గంధాన్ని సమర్పించి ఫాతెహా నిర్వహించారు. ఊరేగింపులో ఫకీర్ల తమ విన్యాసాలతో భక్తులను ఆకట్టుకున్నారు. దర్గా వద్దకు చేరుకున్న పలువురు భక్తులు ఈ సందర్భంగా గురువుల మజార్‌ను దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. శనివారం ఉరుసు ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

పోస్టర్ ఆవిష్కరణ

వైవీయూ : కడప నగరంలోని ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కడప నగరశాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి అతిథిగా విచ్చేసి పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ ఏబీవీపీ అమృత మహోత్సవ్ సంవత్సరంలో భాగంగా డిసెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వస్త్రదానం

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్‌కడప అన్నమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులకు సంస్థ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి వస్త్రదానం చేశారు. క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు పర్యవేక్షణలో 15 మంది నిరుపేద భవన నిర్మాణ కార్మికులకు నూతన వస్త్రాలు, స్వీట్లను పంచి పెట్టారు. లయన్స్ సహాయ కార్యదర్శి బోగాల కొండారెడ్డి, ప్రతినిధి కొండారెడ్డి, పోతుల ట్రావెల్స్ మేనేజర్ రంగ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహార కిట్ అందజేస్తున్న దృశ్యం

కడప రూరల్: జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పాత రిమ్స్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కిట్స్‌ను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పవర్ గ్రిడ్ సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్‌డీ చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ మేనేజర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్ భరత్ క్రిష్ణ, ఉబేదుల్లా, సుమధుర పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతీ యువకులకు కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలోని నందిగామలో హెల్త్ కేర్ కౌన్సిలర్ కో ఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు, 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 90004 87423 సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిబిరం

వైవీయూ : కడప నగరం తెలుగుగంగ కాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–12 ఉత్సాహంగా కొనసాగుతోంది. క్యాంపులో భాగంగా శుక్రవారం ఎన్‌సీసీ కేడెట్స్‌కు రైఫిల్ షూటింగ్ నిర్వహించారు. 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ నీలయ్య పాల్గొన్నారు.

ఆగిన బస్సుతో ఇక్కట్లు



కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 5.00 గంటలకు విజయవాడకు బయలుదేరింది. బస్టాండు ఆవరణ నుంచి బయటికి రాగానే మొరాయించింది. డ్రైవర్ ఎంతగా ప్రయత్నించినా రోడ్డు మధ్యలో బస్సు ఆగిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు సుమారు మూడు గంటలపాటు మొరాయించింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.